RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in  rajadhanivoicedaily@gmail.com

సంపుటి : 02 | సంచిక : 319 | 10 శనివారం అక్టోబరు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రిక

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కొనసాగుటకు గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు మండలాల వారిగా విలేఖరులు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించగలరు.

9030343195

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

## వాహన్, సారథి పోర్టల్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కంట్రోల్ రూమ్..



**అమరావతి, రాజధాని వాయిస్ :** రాష్ట్రంలో రవాణా శాఖ సేవలు పొందుతున్న ప్రజలు వాహన్, సారథి పారివాహన్ పోర్టల్ల ద్వారా ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆన్‌లైన్ సేవల్లో తలెత్తుతున్న ఇబ్బందులను త్వరితగతిన పరిష్కరించడంతోపాటు ప్రజలకు సేవలు మరింత సులభంగా అందించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. ఈ కంట్రోల్ రూమ్ 24 గంటల పాటు అందుబాటులో ఉంటుందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. వాహన యాజమాన్య బదిలీ, డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్, ఆధార్ వివరాల సరిపోలిక, హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ల (హెచ్ఎస్ఆర్పీ) వివరాల నమోదు, సర్వర్ నెమ్మదిగా పనిచేయడం వంటి సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో రవాణా శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ సమస్యల పరిష్కారానికి నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ), కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు.

**ఫిర్యాదుల కోసం ప్రత్యేక నంబర్**

రవాణా శాఖ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చు. ఫోన్ కాల్స్‌తోపాటు వాట్సాప్ సందేశాల ద్వారా కూడా ఫిర్యాదులను నమోదు చేయవచ్చు. ఇందుకోసం 9281607001 నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. రవాణా శాఖ ఆన్‌లైన్ సేవలను వినియోగించే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను ఈ నంబర్ ద్వారా తెలియజేయాలని మంత్రి సూచించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సాధ్యమైనంత వరకు ఆన్‌లైన్‌లోనే సేవలు పొందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సాంకేతిక సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు నిరంతరం సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

## ఈ నెల 14న మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్?



**అమరావతి, రాజధాని వాయిస్:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కసరత్తు వేగవంతమవుతోంది. ముఖ్యం గా మున్సిపల్ ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టి సారించాయి. ఈ నెల 14వ తేదీన మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశాలున్నాయనే ప్రచారం రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. అయితే నోటిఫికేషన్ తేదీపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలకు ఒకే దశలో ఎన్నికలు నిర్వహించే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం, ఎన్నికల సంఘం తమ పరిధిలోని ఏర్పాట్లను సమన్వయం చేసుకుంటున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఎన్నికల షెడ్యూల్, నామినేషన్లు, పోలింగ్, ఓట్ల లెక్కింపు తేదీలపై స్పష్టత రావాల్సి ఉంది. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో రిజర్వేషన్ల అంశం కీలకంగా మారింది. ముఖ్యంగా బీసీలకు 34 శాతం రిజర్వేష న్లు కల్పించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలకు న్యాయపరమైన అడ్డంకులు ఎదురవడంతో తదుపరి కార్యాచరణపై ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో రేపు జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో రిజర్వేషన్ల అంశంపై కీలక చర్చ జరిగే అవకాశముంది. ఎన్నికలకు అనుగుణంగా రిజర్వేషన్లను ఖరారు చేసే అంశంపై కేబినెట్ నిర్ణయం తీసుకుంటుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

# హామీలన్నీ నెరవేరుస్తాం



**ప్రకాశం, రాజధాని వాయిస్** ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి తీరుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తూ పాలన సాగిస్తున్నామని తెలిపారు. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం నర్సింగోలులో 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడారు.రైతులు భూమి భద్రత గురించి ఆందోళన చెందకుండా పంటల సాగు, దిగుబడుల పెంపుపై దృష్టి పెట్టేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 16.48 లక్షల ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించామని వెల్లడించారు. ప్రకాశం జిల్లాలో 3,304 ఎకరాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించి 7,980 కుటుంబాలకు ఊరట కల్పించామని తెలిపారు. భూ రికార్డులను డిజిటలీకరించి, రైతులు తమ భూమి వివరాలను ఫోన్ ద్వారా తెలుసుకునే సౌకర్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

**రూ.36 వేల కోట్లతో 35 ప్రాజెక్టులు**

పోతుల చెంచయ్య పాలేరు జలాశయం, పాలేరు నదిపై ఎత్తైన వంతెన నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు.. పనులు పూర్తయితే 9,500 ఎకరాలకు సాగునీరు, 15 గ్రామాల్లో 30 వేల మందికి తాగునీరు అందుతుందని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు రెండో దశను పూర్తి చేసి ప్రతి ఏటా నీరు అందిస్తామని చెప్పారు. రాబోయే మూడేళ్లలో రూ.36 వేల కోట్లతో 35 ప్రాజెక్టులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.రామాయపట్నం నౌకాశ్రయ నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామని, బీపీసీఎల్ రూ.50 వేల కోట్ల పెట్టుబడితో ఈ ప్రాంత పారిశ్రామిక అభివృద్ధికి ఊతమివ్వనుందని తెలిపారు. దోనకొండను కీలక పారిశ్రామిక పట్టణంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

**అధికారులకు హెచ్చరిక**

ప్రభుత్వ శాఖల పనితీరుపై సభావేదికపైనే సమీక్ష నిర్వహించిన చంద్రబాబు.. తాగునీరు, రవాణా పన్నుల వసూళ్లు, భూముల పునఃసర్వే, అంగన్‌వాడీలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తదితర అంశాల్లో వెనుకబాటుపై అధికారులను ప్రశ్నించారు. ప్రజలకు అందాల్సిన సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామని, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్య వివరాలను డిజిటలీకరించి, మందులు వేసుకునే సమయాన్ని గుర్తుచేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు.సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, పెన్షన్ల పెంపు, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత వంటగ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ వంటి పథకాలతో ప్రజలకు ప్రయోజనం కల్పిస్తున్నామని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించి కేంద్రం, రాష్ట్రం, స్థానిక సంస్థల సమన్వయంతో అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు కట్టుబడి ఉన్నామని చంద్రబాబు తెలిపారు. న్యాయస్థానాల తీర్పులకు లోబడి బీసీలకు 34 శాతానికి మించి సీట్లు కేటాయించేందుకు పార్టీ తరఫున కృషి చేస్తామని చెప్పారు.

## కోనేరు హంపికి నారా లోకేశ్ అభినందనలు



**అమరావతి, రాజధాని వాయిస్ అక్టోబర్ 9:** చెస్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపిని మంత్రి నారా లోకేశ్ అభినందించారు. ఉండవల్లిలోని తన నివాసంలో హంపి, ఆమె తండ్రి అశోక్‌ను కలిసిన లోకేశ్.. చెస్ ఒలింపియాడ్--2026 మహిళల విభాగంలో భారత జట్టు కాంస్య పతకం సాధించడంతో పాటు, వ్యక్తిగత విభాగంలోనూ హంపి కాంస్యం గెలుచుకోవడంపై అభినందనలు తెలిపారు.అంతర్జాతీయ వేదికపై భారత్‌కు గుర్తింపు తీసుకొస్తున్న హంపి విజయాలను లోకేశ్ ప్రశంసించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో చెస్ అభివృద్ధి, యువతలో ఈ క్రీడపై ఆసక్తి పెంపు తదితర అంశాలపై చర్చించారు.

**అమరావతిలో అకాడమీ ఏర్పాటు**

అమరావతిలో ప్రత్యేక చెస్ అకాడమీ ఏర్పాటు చేయాలని హంపి కోరారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు శిక్షణ, మార్గదర్శకత్వం, పోటీ అవకాశాలు కల్పించేలా అకాడమీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

హంపి ప్రతిపాదనపై లోకేశ్ సానుకూలంగా స్పందించారు. అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో చిన్న వయసు నుంచే ప్రతిభను గుర్తించి, మెరుగైన శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అకాడమీ ఏర్పాటుకు సంబంధించిన స్థలం, నిధులు, నిర్వహణ, ప్రారంభ గడువుపై తదుపరి స్పష్టత రావాల్సి ఉంది. ప్రతిపాదన కార్యరూపం దాల్చితే రాష్ట్రంలోని యువ చెస్ క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణా వేదిక అందుబాటులోకి రానుంది.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతాం

**- జనాభా ప్రాతిపదికను బీసీలకు పదవులు దక్కాలన్నదే మా అభిమతం : మంత్రి సవిత**

**పెనుకొండ/శ్రీసత్యసాయి, రాజధాని వాయిస్ :** స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కోసం చిట్టచివరి వరకూ, చిత్తశుద్ధితో న్యాయపోరాటం చేశామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పును గౌరవిస్తూ, బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామని, పార్టీ పరంగా వర్తింపజేస్తామని స్పష్టంచేశారు. బీసీలు రాజకీయంగా ఎదగడం జగన్ కు ఇష్టం లేదని, అందుకే ఆయన హైకోర్టులో కేసులు వేసి బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నారని మండిపడ్డారు. శ్రీసత్యసాయిజిల్లా పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. బీసీల అభ్యున్నతే లక్ష్యంగా అన్న ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా గుర్తింపు లభించేలా టీడీపీ ప్రభుత్వాలు కృషి చేస్తూ వస్తున్నాయన్నారు. 1987లో మొట్టమొదటి సారిగా స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లను అన్న ఎన్టీఆర్ అందజేశారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు 1995లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచారన్నారు. ఆనాటి నుంచి 2021 వరకూ బీసీలకు రిజర్వేషన్లు అమలవుతూ వస్తున్నాయన్నారు. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరవాత బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి కుదించి.. 10 శాతం మేర కోత విధించారన్నారు. దీనివల్ల బీసీలు చివరిసారిగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 16,800 పదవులు కోల్పోయారని మంత్రి సవిత ఆవేదన వ్యక్తంచేశారు.

**బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్న జగన్**

బీసీలకు జనాభా ప్రాతిపదికన పదవులు దక్కాలన్నది సీఎంచంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగానే బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరించాలని నిర్ణయించారన్నారు. బీసీలు రాజకీయంగా ఎదగడం ఇష్టంలేని జగన్ హైకోర్టుకెళ్లి బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పిల్ దాఖలు చేశారని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని హైకోర్టు తీర్పుఇవ్వడంతో, సుప్రీం కోర్టును ఆశ్రయించామన్నారు. టీడీపీకి చెందిన కేంద్రమంత్రి రామ్మోహననాయుడు, రాష్ట్రానికి చెందిన మంత్రులు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి ఢిల్లీ వెళ్లి న్యాయ నిపుణులతో చర్చించారన్నారు. చిట్టచివరి



వరకూ బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పనకు చిత్తశుద్ధితో న్యాయ పోరాటం చేశామని మంత్రి సవిత వెల్లడించారు..

**పార్టీపరంగా 34 శాతం రిజర్వేషన్లు**

సుప్రీం కోర్టులోనూ బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తీర్పురావడం బాధాకరమని, దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పును శిరసావహిస్తామని మంత్రి సవిత తెలిపారు. కోర్టులు కొట్టేసినా బీసీలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని స్పష్టంచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కూటమి తరఫున 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామని తెలిపారు. బీసీల బాగుకోరే ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబు నాయుడని తెలిపారు. చరిత్రలో ఎరుగని విధంగా బడ్జెట్ లో బీసీల కోసం అత్యధిక నిధులు కేటాయించామన్నారు. బీసీలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ఎంఎస్ఎంఈ పార్కుల్లో అవకాశమిస్తున్నామన్నారు. అన్ని బీసీ కులాలకు ఆర్థిక మేలు కలిగేలా పథకాలు, అభివృద్ధికార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు.

## స్థానిక ఎన్నికలు ఆపేందుకు వైసీపీ కుట్ర: మంత్రి కొల్లు రవీంద్ర



**అమరావతి, రాజధాని వాయిస్ :**వైసీపీ స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతోందని, తద్వారా రాష్ట్రానికి రావాల్సిన రూ. 12,500 కోట్ల ఆర్థిక సంఘం నిధులను నిలిపివేయాలని చూస్తోందని రాష్ట్ర ఎక్సైజ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం మంగళగిరిలోని తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వర్గీయ ఎన్టీఆర్ బీసీలకు రాజకీయ రిజర్వేషన్ల పునాది వేయగా, ముఖ్యమంత్రి చంద్రబాబు వాటిని 34 శాతానికి పెంచి వారి ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేశారని కొల్లు రవీంద్ర గుర్తుచేశారు. అయితే, గత ప్రభుత్వం కుట్రపూరితంగా కోర్టుల ద్వారా ఈ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. దీనివల్ల దాదాపు 16,800 మంది బీసీలు రాజ్యాంగబద్ధమైన పదవులను కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నికల హామీ మేరకు 34 శాతం రిజర్వేషన్ల అమలుపై అసెంబ్లీలో తీర్మానం చేశామని, దీనిపై ఏర్పాటు చేసిన రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని బీసీ కమిషన్ నివేదిక త్వరలో ప్రభుత్వానికి అందనుందని మంత్రి తెలిపారు. స్థానిక సంస్థల పదవీకాలం ముగిసినందున 16వ ఆర్థిక సంఘం నిధులు సాధించాలంటే ఎన్నికల నిర్వహణ తప్పనిసరని, ఈ క్రమంలో ప్రభుత్వం ముందుకు వెళుతుంటే.. ఓటమి భయంతో వైసీపీ మరోసారి కోర్టులను ఆశ్రయించి ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవాలని చూస్తోందని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన రూ.12,500 కోట్లు రాకుండా అడ్డుకోవడమే వారి దురుద్దేశమని విమర్శించారు.గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామీణ వ్యవస్థ సర్వనాశనమైందని కొల్లు రవీంద్ర మండిపడ్డారు. రాజశేఖర్ రెడ్డి హయాం నుంచే బీసీల ఎదుగుదలను అడ్డుకుంటున్నారని, జగన్ పాలనలో తోట చంద్రయ్య, నందం సుబ్బయ్య వంటి బీసీ నేతల హత్యలు జరిగాయని ఆరోపించారు. ఇప్పుడు కల్లబొల్లి మాటలతో బీసీలను మభ్యపెట్టాలని చూస్తున్నారని, వారి నాటకాలను బీసీ సోదరులు ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మరని హితవు పలికారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయిస్తోందని, నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్, గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు వంటి హామీలను నెరవేరుస్తోందని వివరించారు. చట్టపరంగా అన్ని అడ్డంకులను అధిగమించి బీసీలకు న్యాయం చేస్తామని, రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్నికలు నిర్వహించి తీరుతామని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

# ఆర్థిక నివేదికల ఆధారంగా ప్రగతి సాధించేలా చర్యలు

**వివిధ రంగాల అభివృద్ధికి నిపుణుల సలహాలు**
**సెప్టెంబర్ నెల ఆర్థిక నివేదికపై సమీక్షలో సీఎం చంద్రబాబు**



**అమరావతి, రాజధాని వాయిస్** ప్రతి నెలా ఆర్థిక నివేదికలు సమర్పిచడంతోపాటు... ఆ నివేదికల ఆధారంగా ఆయా రంగాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. సెప్టెంబర్ నెల ఆర్థిక నివేదికను ప్రణాళిక శాఖ అధికారులు సీఎం చంద్రబాబుకు సమర్పించారు. ఈ మేరకు శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వివిధ అంశాలపై సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర స్థూల ఆర్థిక స్థితిగతులు, వివిధ రంగాల పనితీరు, ద్రవ్యోల్బణ పరిస్థితి వంటి అంశాలపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..." రాష్ట్రంలో ఆర్థిక ప్రగతి క్షేత్రస్థాయిలో ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలి. ప్రతి నెల సిద్ధం చేసుకుంటున్న ఆర్థిక నివేదికల ఆధారంగా వివిధ రంగాల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలి. రిపోర్టులు తీసుకుని చర్చించుకోవడం కాకుండా... ఆ నివేదికల ఆధారంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. చేపట్టాల్సిన మార్పులు చేర్పులపై దృష్టి సారించాలి. ఈ మేరకు ఉన్నతా ధికారులు మొదలుకుని... జిల్లా కలెక్టర్లు.. క్షేత్ర స్థాయిలోని సిబ్బంది వరకు దానికి అనుగుణంగా నడుచుకోవాలి. ఆర్థిక నివేదికలను ఆయా శాఖలకు చెందిన ఉన్నతాధికారులకు అందించాలి. ఏమేం అంశాలు సరి చేసుకోవాలోననే విషయాలను వారికి వివరించాలి. వ్యవసాయ రంగంలో వృద్ధి కన్పిస్తోంది. అదే తరహాలో సేవల రంగం, పరిశ్రమల రంగం కూడా పుంజుకోవాల్సిన అవసరం ఉంది. ప్రణాళిక శాఖ రూపొందించిన నివేదికల ఆధారంగా తమ తమ శాఖల పనితీరును మెరుగు పరుచుకోవాలి. అలాగే వివిధ నిపుణుల సలహాలను తీసుకోవాలి. ఈ మేరకు నిపుణుల బృందాన్ని గుర్తించి వారి సేవలను వినియోగించుకోవాలి. ప్రపంచ వ్యాప్తంగా ఆయా రంగాల్లో ఎక్కడెక్కడ ఉత్తమ పద్దతులు ఉన్నాయో గుర్తించి.. వాటిని ఇక్కడి పరిస్థితులకు తగ్గట్టు అమలు చేయాలి. ఏ ప్రభుత్వమూ చేయని విధంగా నియోజకవర్గాల స్థాయిలో ప్రణాళికలను అమలు చేస్తున్నందుకు ప్రధాని అభినందించారు. క్షేత్ర స్థాయిలో ఉన్న అవకాశాలను ప్రపంచ మార్కెట్టుకు చేరేలా చూడాలని ప్రధాని సూచించారు. ఈ మేరకు నియోజకవర్గాల్లో విజన్ యూనిట్ ప్లాన్లు అమలు చేయాలి. ధరలు పెరగకుండా చూడాలి."అని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సమావేశంలో సీఎస్ సాయి ప్రసాద్, ఆర్థిక, ప్రణాళిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రీసర్వే ప్రక్రియపై జెసిలు ప్రతి రోజు కలెక్టర్లు వారానికి ఒకసారి సమీక్షించాలి: సిఎస్




**అమరావతి, రాజధాని వాయిస్:** రాష్ట్రంలో భూములు రీసర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ప్రగతిలో వెనుకబడిన మండలాల అధికారులతో జాయింట్ కలెక్టర్లు ప్రతి రోజు, జిల్లా కలెక్టర్లు వారానికి ఒకసారి టెలికాన్ఫరెన్స్ లేదా వీడియో కాన్ఫరెన్స్ లో ద్వారా సమీక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశిం చారు. శుక్రవారం ఎపి సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం భూముల రీసర్వే ప్రక్రియ వివిధ దశల్లో ఉందని ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈసమావేశంలో జిల్లా కలెక్టర్లు, వివిధ అధికారులు పాల్గొన్నారు.

## ఆర్టీజీఎస్ పనితీరు ఆదర్శప్రాయం

**డేటాలేక్ చాలా బాగుంది**
**రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయకుమార్ నారాయణ్ ప్రశంసలు**



**అమరావతి రాజధాని వాయిస్:** రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ పనితీరు, ఈ సంస్థ చేపడుతున్న వివిధ సాంకేతిక కార్యకలాపాలు ఆదర్శప్రాయంగా, అనుసరణీయంగా ఉన్నాయని రిజిస్ట్రార్ జనరల్ మరియు సెన్సెస్ కమిషనర్ ఆఫ్ ఇండియా మృత్యుంజయకుమార్ నారాయణ్ అభినందించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ ఆయనకు స్వాగతం పలికి ఆర్టీజీఎస్ పనితీరు, దాని లక్ష్యాల గురించి వివరించారు. ఆర్టీజీఎస్ చేపడుతున్న డేటాలేక్, అవేర్, ఆర్టీజీఎస్ సీసీటీవీ360, యూనిఫైడ్ గవర్నెన్స్ డ్యాష్ బోర్డు, మనమిత్ర తదితర కార్యక్రమాలు అమలు చేస్తున్న తీరు గురించి విపులీకరించారు. ప్రభుత్వంలోని అన్ని శాఖల్లో ఉన్న డేటాను ఒక చోట అనుసంధానం చేసి ఈ డేటాను ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సు ద్వారా విశ్లేషించి పాలనను మరింత సరళీకృతం చేయడానికి దోహదపడే పలు రకాల యూస్ కేసెస్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. తద్వారా పౌరులకు ప్రభుత్వ సేవలు సంక్లిష్టంగా కాకుండా సరళంగా మారి, ఎలాంటి అంతరాయాలు లేకుండా పౌరులకు సేవలు అందేలా చూస్తున్నట్లు తెలిపారు. అవేర్ విభాగం ద్వారా నిరంతరం వాతావరణ పరిస్థితులను రియల్ టైమ్‌లో పర్యవేక్షిస్తున్నామన్నారు. దీనిద్వారా ముందస్తుగానే వాతావరణ మార్పులను పసిగట్టి విపత్తుల నుంచి ప్రజలను, యంత్రాంగాన్ని ముందస్తుగానే అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు. వరదలు, తుఫాన్ లాంటి విపత్తుల సమయంలో అవేర్ ద్వారా అత్యాధునిక సాంకేతిక విశ్లేషణల ద్వారా ప్రాణనష్టం, ఆస్తినష్టాల తీవ్రతను గణనీయంగా తగ్గించగలిగేలా ఆర్టీజీఎస్ సాంకేతిక తోడ్పాటు అందిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో నీటి లభ్యత కూడా రియల్ టైమ్‌లో మానిటరింగ్ చేస్తున్నామన్నారు. సీసీఎల్ ఏ జాయింట్ సెక్రటరీ టీ.ఎస్. చేతన్ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రీసర్వే ప్రాజెక్టు గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం మృత్యుంజయకుమార్ నారాయణ్ మాట్లాడుతూ ఆర్టీజీఎస్ చేపడుతున్న కార్యకలాపాలను కొనియాడారు. ప్రధానంగా డేటాలేక్ ప్రాజెక్టును ఆయన ఆసక్తిగా తిలకించారు. డేటాలేక్ లాంటి ప్రాజెక్టు అనుసరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సెన్సెన్స్ ఆపరేషన్స్ డైరెక్టర్ జె. నివాస్, ఆర్టీజీఎస్ ఎగ్జిక్యూటివ్ అసిస్టెంటు పి. శ్రీఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై ఆరోపణలు

**- విచారణకు పవన్ ఆదేశం**
**- వాస్తవాలు తెల్చేందుకు ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు**
**- ఎమ్మెల్యే వ్యవహారశైలిపై పార్టీ అధిష్ఠానం దృష్టి**
**- క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నివేదిక సమర్పణ**
**- నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు**



**అమరావతి, రాజధాని వాయిస్ :** జనసేన పార్టీకి చెందిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై వస్తున్న ఆరోపణల వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ స్పందించారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపేందుకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించింది. ఎమ్మెల్యేపై వస్తున్న ఆరోపణల వెనుక వాస్తవాలను వెలికితీసి, పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని కమిటీకి బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలిపింది. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలపై పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకోనుంది. ఈ పరిణామం జనసేన పార్టీలో చర్చనీయాంశంగా మారింది.ఎమ్మెల్యే చిర్రి బాలరాజు వ్యవహారశైలి, పనితీరుపై పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కొంతకాలంగా అసంతృప్తితో ఉన్నట్లు పార్టీ వర్గాల సమాచారం. ఇటీవల మీడియాలో ఆయనకు సంబంధించిన ఆరోపణలు వెలుగులోకి రావడంతో పార్టీ నాయకత్వం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది. గతంలోనూ బాలరాజును పార్టీ కార్యాలయానికి పిలిపించి గిరిజన ప్రజలకు పారదర్శకమైన, నీతివంతమైన పాలన అందించాలని, ప్రజాసేవకు ప్రాధాన్యం ఇవ్వాలని పవన్ కల్యాణ్ సూచించినట్లు పార్టీ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాప్రతినిధిగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజల్లో పార్టీకి ఉన్న విశ్వసనీయతను కాపాడాలని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. తాజాగా వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణకు నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.గిరిజన ప్రాంతాల అభివృద్ధి, అక్కడి ప్రజల సమస్యల పరిష్కారానికి జనసేన పార్టీ పలు కార్యక్రమాలను చేపడుతోంది. ముఖ్యంగా 'అడవితల్లి బాట' వంటి కార్యక్రమాల ద్వారా గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, ప్రజల అవసరాలపై దృష్టి సారిస్తున్నట్లు పార్టీ నాయకత్వం చెబుతోంది. ఈ నేపథ్యంలో గిరిజన ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేపై ఆరోపణలు రావడం పార్టీకి రాజకీయంగా ఇబ్బందికరంగా మారినట్లు విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాప్రతినిధుల పనితీరు, ప్రవర్తనపై ప్రజల్లో వచ్చే అభిప్రాయాలు పార్టీ ప్రతిష్ఠపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో నాయకత్వం ఈ అంశాన్ని నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఎమ్మెల్యేపై వచ్చిన ఆరోపణలు విచారణలో నిర్ధారణ కావాల్సి ఉంది.పవన్ కల్యాణ్ ఏర్పాటు చేయనున్న ఉన్నతస్థాయి కమిటీ క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, ఆరోపణలకు సంబంధించిన వివరాలను పరిశీలించనుంది. సంబంధిత వ్యక్తుల నుంచి సమాచారం సేకరించడంతో పాటు అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించనుంది. విచారణ పూర్తయిన తర్వాత కమిటీ తన నివేదికను పార్టీ అధ్యక్షుడికి సమర్పించనుంది. ఆరోపణల తీవ్రత, విచారణలో వెల్లడయ్యే అంశాలు, పార్టీ నియమావళి ప్రకారం తీసుకోవాల్సిన చర్యలపై నివేదికలో వివరాలు ఉండే అవకాశం ఉంది. విచారణ నిష్పక్షపాతంగా సాగి వాస్తవాలు వెలుగులోకి రావడమే కీలకమని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. కమిటీ విచారణ ఎప్పటిలోగా పూర్తవుతుంది, నివేదికను ఎప్పుడు సమర్పిస్తుంది అనే అంశాలపై మరిన్ని వివరాలు వెల్లడికావాల్సి ఉంది.కమిటీ నివేదిక అందిన తర్వాత ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై తదుపరి చర్యలు తీసుకునే అంశాన్ని పార్టీ నాయకత్వం పరిశీలించనుంది. ఆరోపణలు నిర్ధారణ అయితే పార్టీ పరంగా ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు, విచారణ పూర్తయ్యే వరకు ఆరోపణలను నిర్ధారిత వాస్తవాలుగా పరిగణించలేమనే అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ నియమావళి, ప్రజాప్రతినిధుల బాధ్యతలు, గిరిజన ప్రాంతాల ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నాయకత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు ప్రకటనతో ఈ వ్యవహారం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకోగా, విచారణ నివేదికలో వెల్లడయ్యే అంశాలు తదుపరి పరిణామాలకు కీలకంగా మారనున్నాయి.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై విస్తృత ప్రచారం కల్పించాలి

**- కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ కమిషనర్ భాను ప్రకాష్**



**అమరావతి రాజధాని వాయిస్:** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ పై విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్లను సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ భాను ప్రకాష్ ఆదేశించారు. ఉమ్మడి కృష్ణా-గుంటూరు మరియు తూర్పు గోదావరి-పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి సన్నాహక ఏర్పాటచలపై శుక్రవారం ఢిల్లీ నుండి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ వర్చువల్ గా పాల్గొనగా అదనపు ప్రధాన ఎన్నికల అధికారులు దిల్లీ రావు,వెంకటేశ్వర రావుతో పాటు ఉమ్మడి కృష్ణా గుంటూరు,తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమీషనర్ భాను ప్రకాష్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఓటర్ల నమోదు ప్రక్రియకు సంబంధించి ప్రచార కార్యక్రమాలను మరింత ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు.అర్హులైన ప్రతి ఉపాధ్యాయుడు ఓటరుగా పేరు నమోదు చేసుకునేలా చూడాలని కలెక్టర్లకు సూచించారు.ఐఈసీ కార్యకలాపాల ద్వారా ఓటరు నమోదు ప్రక్రియపై విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో అవలంబించాల్సిన విధానాలపై దిశా నిర్దేశం చేశారు. నిబంధనలకు అనుగుణంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా సమర్ధవంతంగా నిర్వహించాలని ఆయన సూచించారు

## నిబంధనల సరళీకరణ, అనుసరణ భారాల తగ్గింపు ప్రక్రియను వేగవంతం చేయాలి

**28 ప్రాధాన్య అంశాల్లో 20 అమలు దశలో పురోగతి -- పెండింగ్ సంస్కరణలను గడువులోగా పూర్తి చేయాలి**
**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్**





**అమరావతి, రాజధాని వాయిస్ :** నిబంధంనల సరళీకరణ, అనుసరణ భారాల తగ్గింపు ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, కేంద్ర ఉక్కుశాఖ కార్యదర్శి సందీప్ పాండ్రిక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో వారు రెండో దశలో నిబంధనల భారాన్ని తగ్గించడం మరియు నియంత్రణల సడలింపు అంశంపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పాఠశాల విద్య, ఉన్నత విద్య, పరిశ్రమలు, వాణిజ్యం,లీగల్ మెట్రాలజీ శాఖల వారీగా పురోగతి, పెండింగ్ అనుమతులు,చట్ట సవరణలు, జారీ చేయాల్సిన ఉత్తర్వులపై సమీక్షించారు.ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, ఆటస్థలాలు, ప్రయోగశాలలు తదితర నిబంధనలను సరళీకరించడం, గుర్తింపు కోసం అవసరమైన ఎసెన్షియాలిటీ సర్టిఫికెట్ స్థానంలో స్వీయ ధృవీకరణ విధానాన్ని ప్రవేశపెట్టడం, ప్రైవేట్ విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు భూమి మరియు ఎండోమెంట్ ఫండ్ అవసరాలను తగ్గించడం వంటి ప్రతిపాదనలపై సమీక్షించారు. పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు అవసరమైన నిరభ్యంతర పత్రాలు (చీూజం), బహుళ లైసెన్సుల సంఖ్యను తగ్గించడం, మీూవీజులకు స్వీయ ప్రకటన ఆధారంగా వ్యాపార కార్యకలాపాల ప్రారంభానికి అవకాశం కల్పించడం, తక్కువ ప్రమాద స్థాయి పరిశ్రమలకు అనుమతులు, తనిఖీల ప్రక్రియను సరళీకరించడం వంటి సంస్కరణలను వేగవంతం చేయాలని చెప్పారు.లీగల్ మెట్రాలజీ విభాగంలోనూ రిజిస్ట్రేషన్లు, లైసెన్సుల జారీని సులభతరం చేసే చర్యలను ఆయన సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులు, చట్ట సవరణలు, నోటిఫికేషన్లను నిర్దేశిత గడువుల్లో పూర్తి చేసి, అనవసరమైన అనుమతులు, జాప్యాలను తగ్గించడం ద్వారా వ్యాపార సౌలభ్యాన్ని పెంపొందించి, పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని బలోపేతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

## దుర్గామండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా

**విజయవాడ, రాజధాని వాయిస్ :** విజయదశమి పండుగ సందర్భంగా దుర్గాదేవి మండపాలకు ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 కిలోవాట్లు, పట్టణ ప్రాంతాల్లో 5 కిలోవాట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అనుమతి పొందిన దుర్గా మండపాల నిర్వాహకులు నిర్ణీత నమూనాలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నిర్దేశించిన పరిమితికి మించి విద్యుత్ లోడ్ అవసరమైతే సాధారణ తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేశారు.

**మండపాల వద్ద విద్యుత్ భద్రతకు ప్రాధాన్యం**

దుర్గా మండపాలకు విద్యుత్ సరఫరా చేసే ముందు అధికారులు అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సీఎండీ ఆదేశించారు. పండుగ సందర్భంగా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా మండపాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.విద్యుత్ స్తంభాలు, తీగలకు దూరంగా మండపాలను ఏర్పాటు చేయాలని, మండపాల పైనుంచి విద్యుత్ తీగలు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. విద్యుత్ అలంకరణల కోసం నాణ్యమైన వైర్లు, స్విచ్‌లు, ప్లగ్‌లను మాత్రమే వినియోగించాలని తెలిపారు. విద్యుత్ కనెక్షన్లు, అలంకరణల ఏర్పాటు విషయంలో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు.ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడినా, వేలాడుతున్నా వాటిని తాకకుండా, వాటికి దూరంగా ఉండాలని హెచ్చరించారు. అటువంటి పరిస్థితులు ఎదురైతే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని లేదా 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని సీఎండీ పి. పుల్లారెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# సెయింట్ ఆన్స్ కాలేజీలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం

**గుంటూరు, రాజధాని వాయిస్ :** అమరావతి రోడ్డు నందలి సెయింట్ ఆన్స్ జూనియర్ కాలేజీ ఫర్ గర్ల్స్ నందు "అంతర్జాతీయ బాలికా దినోత్సవము" ను జిల్లా మహిళా మరియు శిశు అభివృద్ధి సంస్థ, జిల్లా బాలల రక్షణ విభాగం మరియు చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ – క్రాఫ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించడమైనది. ఈ కార్యక్రమములో పి.పి.జి ప్రసూన, జిల్లా మహిళా ఒ శిశు సంక్షేమ సాధికారిక అధికారి వారు మాట్లాడుతూ బాల్య వివాహాలను అంతం చేద్దాం మరియు బాలికల హక్కులు, విద్యలో పెట్టుబడి పెడదాం అని పిలుపునిచ్చారు. సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతలు, వివక్షతపై అవగాహన పెంచడం, బాలికలపై జరిగే వేధింపులు వాటి అనర్ధాలను నివారించి, వారి సంపూర్ణ హక్కులను వారు పొందుకునే విధంగా చేయడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశమని, బాలికలు, యువతులు వారి వారి రంగాలలో ప్రచారం, పరిశోధనలకు సంబంధించి సాధించిన అభివృద్ధిని ప్రతిబింబించేలా చేయాలని కోరారు. అలాగే తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువ కలిగిన ఆహార పదార్థాల గురించి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో జె. వాణి గర్ల్స్ చైల్డ్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మాట్లాడుతూ బాలికల వాయిస్‌లను పెంచే విధంగా, బాలికల ఆధికారాన్ని సాధించే విధంగా, వారి భవిష్యత్తును మెరుగుపరచడానికి అందరం పని చేయాలని, కుటుంబాలలో, సమాజంలో ప్రతి ఒక్కరు బాలికల ఆలోచనలు, అభిప్రాయాలు తీసుకొని దానికి అనుగుణంగా వారి అభివృద్ధి కోసం ప్రణాళికలు తయారు చేయాలని కోరారు. బాలలకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్స్ 1098, డయల్ 100, ఉమెన్ హెల్ప్ లైన్ నెంబర్ 181, 112, గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమములో డాక్టర్ ఏ. శ్రీవల్లి డిస్టిక్ ఇమునైజేషన్ ఆఫీసర్ మాట్లాడుతూ అబ్బాయిల మాదిరిగానే అమ్మాయిలను కూడా సమానంగా పెంచితే సమాజం మెరుగ్గా ఉంటుందని, బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతలు విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, హింస, బలవంతపు బాల్య వివాహలు, వివక్షతపై అవగాహన పెంచడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశం అని, బాలికలకు అవకాశం ఇస్తే అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. బాలికల అభివృద్ధి కోసం అందరం కలిసి పనిచేయాలని కోరారు. బాలికలను విద్యావంతులను చేసి, బాల్య




వివాహాలు తగ్గించడంలో, విద్యను అభ్యసించిన బాలికలు అధిక వేతనాలతో ఉద్యోగాలు పొందడంలో మార్గదర్శకంగా నిలవడం ద్వారా మహిళ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమములో సమావేశంలో కె. తరంగిణి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నగరంపాలెం మాట్లాడుతూ బాలికలు ఫేస్ బుక్ , వాట్సాప్, ఇంస్టాగ్రామ్, దూరంగా ఉండాలని, బాల బాలికలు ఫోన్ కానీ, కంప్యూటర్ కానీ విద్య సంబంధమైన విషయాలు కాకుండా సోషల్ మీడియా గేమ్స్ వంటి వాటి జోలికి పోకూడదని ఒకవేళ మీరు సోషల్ మీడియా యాప్స్ వాడుతున్నట్లయితే జాగ్రత్తలు తీసుకోవాలి అపరిచితులతో ఆన్లైన్ యాప్ లో స్నేహం చేయకూడదు. రకరకాల యాప్స్ డౌన్ లోడ్ చేసుకునే ముందు తల్లిదండ్రులు తో చర్చించి చేసుకోవలెనని తెలిపారు. సి. హెచ్. విజయ్ కుమార్, జిల్లా బాలల పరిరక్షణాధికారి, గుంటూరు వారు బాల్య వివాహ నిషేధిత చట్టము మరియు POCSO చట్టము గురించి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమమునకు పి.పి.జి ప్రసూన, జిల్లా మహిళా ఒ శిశు సంక్షేమ సాధికారిక అధికారి , గుంటూరు, టి. శ్రీవాణి, డిస్ట్రిక్ట్ మిషన్ కో-ఆర్డినేటర్, శ్రీ సి. హెచ్. విజయ్ కుమార్, జిల్లా బాలల పరిరక్షణాధికారి, సిస్టర్ విమలా మేరీ, ప్రిన్సిపల్, సెయింట్ ఆన్స్ జూనియర్ కాలేజీ, జె. వాణీ, గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్, డాక్టర్ ఏ. శ్రీవల్లి డిస్టిక్ ఇమునైజేషన్ ఆఫీసర్, ప్రియాంక, మెడికల్ ఆఫీసర్, కె. తరంగిణి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నగరంపాలెం, ఎం . మాధురి, లేబర్ ఆఫీసర్, శ్రీ జి. వెంకట్, కో -ఆర్డినేటర్, కె. శాంతి భూషణ గోపి, సెంటర్ అడ్మినిస్ట్రేటర్, వన్ స్టాప్ సెంటర్ మొదగలగు వారు పాల్గొన్నారు.

# బీసీలకు 34% రిజర్వేషన్లకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**గుంటూరు, రాజధాని వాయిస్ :** ఆంధ్రప్రదేశ్ లో బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న లక్ష్యానికి కూటమి ప్రభుత్వం వంద శాతం కట్టుబడి ఉందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూనే, బీసీలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించేందుకు, వారి సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. శుక్రవారం మంగళగిరిలోని తెలుగు దేశం పార్టీ జాతీయ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడు తూ.. బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన తీర్పుతో న్యాయపరమైన ప్రక్రియలో ఒక అడ్డంకి ఎదురైందన్నారు. హైకోర్టు తీర్పును సమర్థిస్తూ సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో, బీసీలకు న్యాయం చేయాలన్న కూటమి ప్రభుత్వ సంకల్పంలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు. కోర్టు తీర్పులను గౌరవిస్తూనే, బీసీలకు సముచిత న్యాయం జరిగేలా ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

**ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకు బీసీలకు ప్రాధాన్యం**

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందని గళ్ళా మాధవి తెలిపారు. దివంగత ఎన్టీఆర్ హయాంలో 20 శాతం బీసీ రిజర్వేషన్లతో ప్రారంభమైన ప్రస్థానం, చంద్రబాబు నాయుడు నాయకత్వంలో 34 శాతం రిజర్వేషన్ల దిశగా ముందుకు సాగిందన్నారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు, వారి జీవితాల్లో స్థిరమైన మార్పు తీసుకురావడానికి టీడీపీ నిరంతరం కృషి చేసిందని చెప్పారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నది కూటమి ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, ఆ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించడం, కొత్త నాయకత్వాన్ని తయారు చేయడం, బీసీ కుటుంబాలను సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం చేయడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని వివరించారు.

**బీసీలకు చట్టబద్ధమైన న్యాయం కోసమే న్యాయపోరాటం**

ఇప్పటివరకు తెలుగుదేశం పార్టీ తన రాజకీయ ప్రాతినిధ్యంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ వచ్చిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అయితే, ఈ ప్రాతినిధ్యానికి చట్టబద్ధమైన గుర్తింపు కల్పించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం న్యాయస్థానాలను ఆశ్రయించిందన్నారు. న్యాయపరమైన ప్రక్రియలో కొన్ని అడ్డంకులు ఎదురైన ంత మాత్రాన బీసీలకు న్యాయం చేయాలన్న లక్ష్యాన్ని వదులుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

బీసీలకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో న్యాయపరమైన పరిమితులు, ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకుని తదుపరి కార్యాచ రణపై కూటమి నాయకత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీసీలకు సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని గళ్ళా మాధవి విమర్శి ంచారు. బీసీలకు న్యాయం చేయాలన్న ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకుంటూ, మరోవైపు బీసీలకు ద్రోహం జరిగిందని ఆరోపించడం వైసీపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు.

34 శాతం రిజర్వేషన్ల అంశంపై న్యాయస్థానాల్లో దాఖలైన వ్యతిరేక పిటిషన్ల వెనుక వైసీపీ ప్రభుత్వ హయాంలో పనిచేసిన న్యాయవాదుల పాత్ర ఉందని ఆమె ఆరోపించారు. రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని దాటుతాయనే వాదనలతో న్యాయపరమైన




అభ్యంతరాలు వ్యక్తం చేసిన విషయాన్ని ప్రస్తావించారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రయత్నాన్ని నిజంగా సమర్థిస్తే, వైసీపీ నాయకత్వం ఆ దిశగా సహకరించాల్సిందని అభిప్రాయపడ్డారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు సాధ్యం కావని ముందే తెలుసని ఇప్పుడు వైసీపీ నేతలు చెబుతున్న మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని విమర్శించారు. కోర్టు తీర్పులు ముందే తెలుసునని చెప్పుకుంటున్న వారు, తమ నాయకులపై ఉన్న కేసులు, డీఎస్సీకి సంబంధించిన న్యాయపరమైన వివాదాల విషయంలోనూ అదే ముందుచూపు ఎందుకు ప్రదర్శించలేకపోయారని ప్రశ్నించారు. ప్రభుత్వ ప్రయత్నాన్ని విమర్శించడం సులభమని, బీసీలకు న్యాయం జరిగేలా ప్రత్యామ్నాయ మార్గాలను సూచించడం ముఖ్యమని అన్నారు.

**బీసీ సంక్షేమ నిధుల వినియోగంపై వైసీపీని నిలదీసిన ఎమ్మెల్యే**

వైసీపీ పాలనలో బీసీల సంక్షేమానికి కేటాయించిన నిధుల వినియోగంపై కూడా గళ్ళా మాధవి ప్రశ్నలు సంధించారు. బీసీ ఉప ప్రణాళిక నిధులను ఇతర అవసరాలకు మళ్లించారని, బీసీ కుటుంబాలకు అందాల్సిన ప్రయోజనాలను పూర్తిస్థాయిలో అందించలేదని ఆరోపించారు. బీసీలకు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం అయ్యే అవకాశాలు కల్పించాల్సిన ప్రభుత్వం, రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చిందని విమర్శించారు. వైసీపీ హయాంలో బీసీలపై దాడులు, హత్యలకు సంబంధించిన ఘటనలు చోటుచేసుకున్నాయని ప్రస్తావిస్తూ, బీసీల సంక్షేమం గురించి మాట్లాడే ముందు గత పాలనలో జరిగిన పరిణామాలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీలకు నిజంగా మేలు చేశామని చెప్పుకునే నాయకులు, తమ పాలనలో ఎంతమంది బీసీ కుటుంబాలు ఆర్థికంగా ఎదిగాయి, ఎంతమందికి రాజకీయంగా స్వతంత్ర నాయకత్వ అవకాశాలు లభించాయో వివరించాలని కోరారు.

**బీసీలకు సముచిత స్థానం కల్పించడమే కూటమి లక్ష్యం**

బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న నిర్ణయానికి తెలుగుదేశం పార్టీ, కూటమి నాయకత్వం కట్టుబడి ఉన్నాయని గళ్ళా మాధవి పునరుద్ఘాటించారు. న్యాయస్థానాల తీర్పులను గౌరవిస్తూనే, బీసీలకు న్యాయం జరిగేలా తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. బీసీ నాయకత్వాన్ని బలోపేతం చేయడం, బీసీ కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడడం, సమాజంలో వారికి సముచిత స్థానం కల్పించడం తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల వంటి కీలక అంశాలను రాజకీయ విమర్శలకు పరిమితం చేయకుండా, బీసీల భవిష్యత్తు కోసం అన్ని పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. బీసీలకు తాము చేసిన అన్యాయంపై ఆత్మపరిశీలన చేసుకోవాలని వైసీపీ నాయకులకు సూచించారు. బీసీల అభ్యున్నతి విషయంలో తెలుగుదేశం పార్టీకి ఉన్న నిబద్ధతను ప్రజలు గుర్తించాలని, సామాజిక న్యాయం సాధించే దిశగా కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

# కిట్స్ కళాశాలలో కోలాహలంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

**గుంటూరు,రాజధాని వాయిస్ :** స్థానిక కె.కె.ఆర్ అండ్ కె.ఎస్.ఆర్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (కిట్స్ కళాశాల)లో న ఫ్రెషర్స్ డే వేడుకలు కనుల పండుగగా జరిగాయి. 2026-2027 విద్యా సంవత్సరానికి చెందిన మొదటి సంవత్సరం బీ.టెక్ విద్యార్థులకు వారి సీనియర్ విద్యార్థులు అద్భుతమైన ఆహ్వానం పలికారు. ఈ వేడుకలను కళాశాల యాజమాన్యం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఛైర్మన్, కార్యదర్శి, డైరెక్టర్ మరియు వివిధ విభాగాధిపతులు హాజరై తమ సందేశాలను ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ డా కోయి సుబ్బారావు మాట్లాడుతూ ఈ కళాశాల విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరచుకునేలా ఉండాలిని, ప్రస్తుతం ఉన్నటువంటి జాబ్ మార్కెట్లో కమ్యూనికేషన్ స్కిల్స్, విత్ కోడింగ్ స్కిల్స్ ఎంతో ప్రాముఖ్యత ఉన్నది, కిట్స్ లో వీటికి మరింత ఎక్కువ ప్రాధాన్యతని కోసం వివిధ కార్యక్రమాలను రూపొందించి అమలుపరుస్తున్నామనిఇస్తున్నామని తెలియజేశారు. ప్రతి ఒక్కరికి ఒక ఆదర్శం ఉండాలి, సమాజానికి ఏదో ఒకటి చేయాలని తపన ఉండాలి, మేము కూడా ఒక చిన్న రైతు కుటుంబం నుంచి ఈ స్థాయికి ఎదిగాము. మీ పేరెంట్స్ ఇప్పటివరకు మీకు చాలా సపోర్ట్ చేశారు, మీ ఆరోగ్యం విషయాల్లోనూ చదువుల విషయాల్లోనూ, మరియు ప్రభుత్వాలు కూడా ఎంతో సపోర్ట్ చేస్తున్నాయి. కాబట్టి కేవలం ఉపాధి దిశగా కాకుండా విద్యార్థులు తమ స్వశక్తితో, తెలివితేటలతో పారిశ్రామికవేత్తలుగా స్థిరపడటానికి కావాల్సిన నైపుణ్యాలను అందిస్తామని తెలిపారు. విద్యార్థులు పరిశోధన మరియు నూతన ఆవిష్కరణల దిశగా అత్యంత ప్రతిభ కనబరిచేలా ప్రోత్సహిస్తున్నామని, వారు రూపొందించిన ఆవిష్కరణలు జాతీయ స్థాయి గుర్తింపు పొందాయని అన్నారు. చదువుకోవాల్సిన వయసులో చదువుకోవాలి చెడు అలవాట్లకు బానిస కాకుండా తల్లిదండ్రుల గురించి ఆలోచించి ఉన్నత స్థాయిలోకి వెళ్లాలి అని, ఈ మధ్యకాలంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించినటువంటి చాలా




ప్రోగ్రామ్స్ మన దేశానికి రానున్న రోజుల్లో ఎంతో గొప్పపేరు ప్రఖ్యాతలు వస్తాయని, భారతదేశం ప్రపంచంలోనే రెండవ ఆర్థిక వ్యవస్థగా ఏర్పడిపోతుందని తెలియజేశారు. కళాశాల కార్యదర్శి కోయి శేఖర్ మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులు అన్ని రంగాల్లో అవగాహన కలిగి ఉండాలని మరియు క్రమశిక్షణ అవలంభిస్తూ లక్ష్యం దిశగా కృషి చేస్తూ తల్లిదండ్రుల ఆశయాలను సాకారం చేసేలా విద్యార్థులు ముందడుగు వేయాలని తెలియజేశారు. నాలెడ్జ్ తో పాటు , నాయకత్వ లక్షణాలను కొన్ని ఉదాహరణలతో వివరించారు. ప్రతి విద్యార్థి , తల్లితండ్రులతో సఖ్యతగా ఉండి వారి యొక్క అనుగుణంగా చదువుకుంటూ సమాజంలో మంచి పేరు తీసుకురావాలని, కాలేజీలో కానీ మీ కుటుంబంలో గానీ సమాజంలో గాని తప్పులు చేయొద్దు తప్పు చేసిన తర్వాత దాన్ని కప్పి ఉంచడానికి మరిన్ని మరికొన్ని తప్పులు చేయవద్దని కొన్ని ఉదాహరణలతో తెలియజేశారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ డా. కె.హరిబాబు మరియు వివిధ విభాగాధిపతులు మాట్లాడుతూ విద్యార్థులకు పలురకాల సూచనలు చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో వేదిక కోలాహలంగా మారింది. విద్యార్థులు ఆటపాటలతో వేడుకను ఉల్లాసంగా జరుపుకున్నారు.

# గుంటూరులో ఈ నెల 11 నుంచి ప్రత్యేక టెట్ పరీక్షలు

**గుంటూరు,రాజధాని వాయిస్ :** ఆంధ్ర ప్రదేశ్ ప్రత్యేక ఉపాధ్యాయ అర్హత పరీక్ష ను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్పెషల్ టెట్ నిర్వహణపై శుక్రవారం సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పరీక్షలు ఈ నెల 11 నుండి 15వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. పరీక్షలు ప్రతి రోజూ రెండు సెషన్లలో జరుగుతాయని అన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 6 పరీక్షా కేంద్రాల్లో 3,398 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. వీరిలో 154 మంది దివ్యాంగులు ఉన్నారని, వీరికి పేరేచర్లలో గల ఇయాన్ డిజిటల్ ఐ.డి.జెడ్ లో కేంద్రం ఏర్పాటు జరుగుతుందని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యుత్, తాగునీరు, వైద్య శిబిరం, పారిశుధ్యం, రవాణా, పోలీసు బందోబస్తు తదితర ఏర్పాట్ల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో మేడికొండూరు మండలం పేరేచర్లలో గల ఇయాన్ డిజిటల్ ఐ.డి.జెడ్, వట్టిచెరుకూరు మండలంలో ఉన్న ప్రియదర్శిని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ కాలేజీ, చేబ్రోలులో ఉన్న ఆర్.వి. ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ప్రత్తిపాడులో గల మిట్టపల్లి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, వట్టిచెరుకూరులో గల మల్లినేని లక్ష్మయ్య విమెన్స్ ఇంజనీరింగ్ కాలేజ్, మల్లినేని పెరుమాళ్ళు ఎడ్యుకేషనల్ సొసైటీ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్‌లో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షా



కేంద్రాల వద్ద అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సదుపాయాలను కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దివ్యాంగ అభ్యర్థులకు అవసరమైన ప్రత్యేక సదుపాయాలు, వైద్య సహాయం అందుబాటులో ఉండాలని అన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు చెల్లుబాటు అయ్యే ఫోటో గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. పరీక్షా కేంద్రానికి ముందుగానే చేరుకుని, పరీక్షా నిబంధనలను పాటిస్తూ పరీక్షకు హాజరు కావాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా సంబంధిత శాఖ అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి డా. షేక్ సలీం భాషా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జాప్యాన్ని నివారించాలని వినతి

**కర్నూలు, రాజధాని వాయిస్:** కర్నూలు జిల్లా ఆలూరు కుల ధ్రువీకరణ పత్రాలు, పిల్లలకు సంబంధించిన కుల యూనిక్ సర్టిఫికెట్లు, కుల-ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో జరుగుతున్న జాప్యాన్ని వెంటనే నివారించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ ఆర్టీఐ సమాచార చట్టం విభాగం జిల్లా ఉపాధ్యక్షులు పత్తికొండ రాజు కోరారు. ఈ మేరకు పత్తికొండ ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు. గతంలో మీ-సేవా కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు సులభంగా అందుబాటులో ఉన్న ఈ సేవలు ప్రస్తుతం సాంకేతిక సమస్యల కారణంగా నిలిచిపోయాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా కాస్ట్ కమ్ ఇన్‌కమ్ లాగిన్ పనిచేయకపోవడంతో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీంతో ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు సచివాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

**విద్యార్థులు, రైతులకు తప్పని ఇబ్బందులు**

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యాసంస్థల్లో ప్రవేశాలకు అవసరమని పేర్కొన్నారు. రైతులు వివిధ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు, అలాగే ఇతర వర్గాల ప్రజలు తమ అవసరాల కోసం ఈ ధ్రువీకరణ పత్రాలపై ఆధారపడుతున్నారని తెలిపారు. నిర్ణీత గడువులోగా సర్టిఫికెట్లు



అందకపోవడంతో విద్యార్థులు, రైతులు, ఇతర లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మీ-సేవా కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లోని లాగిన్‌లకు సంబంధించిన సాంకేతిక లోపాలను తక్షణమే పరిష్కరించాలని పత్తికొండ రాజు కోరారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, అర్హులైన వారందరికీ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను సకాలంలో జారీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

# సంజామలను కరువు మండలంగా ప్రకటించాలని వైయస్సార్‌సీపీ పోరుబాట

సంజామల: సంజామల మండలంలో కరువు సెగలు భగ్గుమంటున్నాయి. సంజామలను తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలంటూ వైఎస్సార్‌సీపీ పోరుబాట పట్టింది. బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో కోట బురుజు నుంచి సంజామల తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గూడం సూర్య ప్రకాష్ రెడ్డి, ఎర్రబోతుల పాపిరెడ్డి, చల్లా విగ్నేశ్వర రెడ్డి ముఖ్య నేతలతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.. ఈ నిరసన ప్రదర్శనకు రైతు సంఘాలు, సీపీఐ నేతలు సంపూర్ణ మద్దతు పలికారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ... మండలంలో అత్యల్ప వర్షపాతం నమోదైనా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరి స్తోందని మండిపడ్డారు. సెలవు దినాల్లో మొక్కుబడిగా అధికారు లకు లేఖలు రాయడం కాదని, సంజామలను కరువు మండలంగా ప్రకటించే బాధ్యత స్థానిక మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిదేనని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి వారం రోజుల గడువు ఇస్తున్నామని, అప్పటికీ స్పందించకపోతే రైతాంగంతో కలిసి ఎమ్మార్వో కార్యాల యం ఎదుటే నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమం లో ఎర్రబోతుల పాపిరెడ్డి, గుండం సూర్య ప్రకాష్ రెడ్డి, చల్లా విగ్నేశ్వర రెడ్డి, రైతు సంఘం నాయకులు సిపిఐ నేతలు పాల్గొన్నారు.

# విద్య, విలువలకు పెద్దపీట వేసిన వివేకానంద పాఠశాల

### జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రదాన కార్యదర్శి జూలకంటి సురేష్

**పిడుగురాళ్ల.అక్టోబర్ 09, రాజధాని వాయిస్:** పట్టణం లోని గవర్నమెంట్ జూనియర్ కాలేజీ ఎదురుగా గల వివేకానంద స్కూల్ లో దసరా సెలబ్రేషన్స్ డైరెక్టర్ రామకృష్ణ మాష్టార్ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రదాన కార్యదర్శి జూలకంటి సురేష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ, మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి అందించే గట్టి ప్రయత్నం వివేకానంద పాఠశాల విద్యార్థుల కు నేర్పించడం అభినందించతగ్గ విషయమని,ఈ రోజుల్లో కూడా ఇలాంటి యాక్టివిటీస్ కు ప్రాధాన్యత ఇచ్చి ప్రతిదీ నేర్పిస్తూ ఉన్న స్కూల్ ను ఎంపిక చేసుకున్న తల్లిదండ్రులు అదృష్టవంతులని,వారి పిల్లలు విద్యతో పాటు సామాజిక విలువలు అలవాటుగా మార్చుకో



వడం గొప్ప విషయం అన్నారు.ఈ సందర్భంగా వివేకా నంద విద్యార్థుల కోలాటం,తల్లిదండ్రులు కోలాటం ఎంతగానో ఆకట్టుకున్నాయి. అతిథులను రామ కృష్ణ మాస్టారు ఘనంగా దుశాలువతో ఘనంగా సన్మానించారు.

# ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు

**పిడుగురాళ్ళ.అక్టోబర్ 09,రాజధాని వాయిస్:** అంతర్జాతీయ బాలిక దినోత్సవం అక్టోబర్ 11 సందర్భంగా పల్నాడు జిల్లా, పిడుగురాళ్ల పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలిక విద్య బాలికల సంరక్షణ పై పాఠశాల ప్రిన్సిపాల్ కొత్త మల్లికార్జున ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్ర ప్రదేశ్ బాలల హక్కుల కమిటీ సభ్యులు కేజీ వెంకట పద్మలత,డిసిపిఓ శౌరి రాజు,పిడి నాగ మల్లేశ్వరి హాజరయ్యారు.ఈ సందర్భంగా వెంకట పద్మలత మాట్లాడుతూ, విద్యార్థుల కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అబ్దుల్ కలాం చెప్పినట్టు కలలు కనండి వాటిని సహకారం చేసుకోవాలని కోరారు ఈ విద్యా సంవత్సరంలో నే పాఠశాలలో బ్యూటిషన్ కోర్సు నేర్పించడం జరుగుతుందని, విద్యతోపాటు స్కిల్స్ నేర్చుకోవడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని బాగా కష్టపడి




చదివి ఉన్నత స్థానానికి ఎదగాలని కోరారు ఈ సందర్భంగా వివిధ తరగతులలో ప్రథమ స్థానం సంపాదించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి బహుమతులు అందించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,లీగల్ సర్వీస్ కమిటీ సభ్యులు కోట బాబురావు, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పిడుగురాళ్లలో పెట్రేగి పోతున్న లాటరీ కేటుగాళ్లు

### మంచి ప్రభుత్వంలో ఛీడ పురుగులు
### అదృశ్య శక్తి శ్రీనివాసరెడ్డి అరెస్టు తప్పదా!

**పిడుగురాళ్ల. అక్టోబర్ 09 రాజధాని వాయిస్ :** పట్టణంలో పేద వర్గాల ప్రజలే టార్గెట్ గా లాటరీ టిక్కెట్ల విక్రయం జోరుగా సాగుతోంది.అమాయక ప్రజలకు ఆశ చూపి లాటరీ టిక్కెట్లు కొంటె రాత్రికి రాత్రే కోటీశ్వరులు కావచ్చనే ముఠా పట్టణంలో పెట్రేగి పోతున్నారు. అజ్ఞాత లాటరీ డాన్ శ్రీనివాస రెడ్డి (అదృశ్య శక్తి) ఏజంటు లను నియమించి వారికి కమిషన్ ఆశ చూపి లాటరీ టిక్కెట్లు విక్రయిస్తున్నారు. ఒక్క పిడుగురాళ్ల పట్నంలోని పది నుంచి 15 మంది ఏజెంట్లను నియమించుకొని లాటరీ టికెట్లు చట్ట విరుద్ధంగా అమ్మి కోట్లు గడిస్తున్నారు.



**లాటరీ టిక్కెట్లు మీ జీవితాల్ని మార్చివేస్తాయి?**

అదృష్టం ఆశ చూపి దండుకుంటున్న దండుపాళ్యాం బ్యాచ్,హమాలీలు,కూలీలు,సున్నం బట్టీ కార్మికులు,లారీ, ట్రాక్టర్ ఆటో డ్రైవర్లకు గాలం వేస్తున్నారు. పేదవాడి కష్టం లాటరీ టికెట్లతో కొంప ముంచుతున్న వైనం.లాటరీ టిక్కెట్లు కొని డబ్బులు వస్తాయని కోటి ఆశలతో ఎదురు చూస్తు,రాకపోగా ఎన్నో సార్లు లాటరీ టిక్కెట్లు కొని,సంపద అంతా టిక్కెట్ల కే పెట్టి పేద కుటుంబాలు తల్లడిల్లిపోతున్నాయి.లాటరీలు ఎక్కడ తీస్తారో ఎవరికీ తెలియదు, అమాయకుల జేబులు మాత్రం ఖాళీ అవుతున్న వైనం. ఒక్క లాటరీ టికెట్ కొను మీ జీవితాలే మారిపోతాయని మోసపూరిత మాటల చెప్పి ప్రజల కష్టాన్ని లాటరీ టికెట్ల రూపంలో సొమ్ము చేసుకుంటున్నారు కేటుగాళ్లు, ఆరుగాలం కష్టపడిసంపాదించిన సొమ్ము మొత్తం మాయగాల ఉచ్చులో పడి లాటరీ టికెట్లు కొని అమాయక ప్రజలు మోసపోతున్నారు.

**ది లాటరీస్ రెగ్యులేషన్ యాక్ట్-1998**

దేశంలో ప్రభుత్వ అనుమతి లేని అనాధికార లేదా నిషేధిత లాటరీ టిక్కెట్లను విక్రయించడం, పంపిణీ చేయడం చట్టరీత్యా నేరం.ది లాటరీస్ రెగ్యులేషన్ యాక్ట్-1998 నూతన భారతీయ శిక్షాస్మృతి ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అనాధికార లాటరీల విక్రయించే వాళ్ళకు జైలు శిక్ష, జరిమానా రెండు విధిస్తారు.చట్ట నిబంధనలకు విరుద్ధంగా అనాధికార లాటరీలను నిర్వహించినా, వాటి ప్రమోటర్లుగా వ్యవహరించినా లేదా ఆ టిక్కెట్లను విక్రయించినా, పంపిణీ చేసినా 2 ఏళ్ళ వరకు కఠిన జైలు శిక్ష పడే అవకాశం ఉంది.బెయిల్ దొరకని నాన్-బైలబుల్ నేరం సెక్షన్ 8 చెపుతుంది.ఈ చట్టం కింద అనాధికార లాటరీ టిక్కెట్లు అమ్మడం అనేది కాగ్నిజబుల్ నాన్-బైలబుల్ నేరంగా పరిగణించబడుతుంది. అంటే పోలీసులు మేజిస్ట్రేట్ వారెంట్ లేకుండానే నిందితులను అరెస్ట్ చేయవచ్చు,స్టేషన్ లోనే వీరికి సులభంగా బెయిల్ లభించదు. మోసపూరితమైన లేదా నకిలీ లాటరీల ద్వారా ప్రజలను మోసం చేస్తే చీటింగ్ క్రిమినల్ ప్లానింగ్ వంటి ఇతర కఠినమైన సెక్షన్ల కింద కూడా కేసులు నమోదు చేస్తారు.

**ఏపి లాటరీల నిషేధ చట్టం-1968**

ఆంధ్రప్రదేశ్‌లో లాటరీ టిక్కెట్లు అమ్మడం పూర్తిగా నిషేధం మరియు చట్టవిరుద్ధం. ఆంధ్రప్రదేశ్ లాటరీల చట్టం, 1968 ప్రకారం రాష్ట్రంలో ఎలాంటి లాటరీ టిక్కెట్లను ముద్రించడం, పంపిణీ చేయడం లేదా విక్రయించడం శిక్షార్హమైన నేరంగా పరిగణిస్తారు.

**అమాయకులకు ఆశల వల**

రాష్ట్రంలో నిషేధిత లాటరీల విక్రయం అమలులో ఉన్న పిడుగురాళ్లలో మాత్రం యదేచ్ఛగా లాటరీ టిక్కెట్లు విక్రయం కొనసాగుతుంది, అమాయకుల ఆశ పెట్టుబడిగా భావించి కోట్లు దండుకుంటున్నారు.కొన్ని ఏళ్ళ నుండి పట్నంలో నిషేధిత లాటరీ టికెట్ల విక్రయం కొనసాగుతుంది, దీనివల్ల అమాయకులే నష్టపోతున్నారు తప్ప ఎవరూ లాటరీ టికెట్లు గెలిచిన సందర్భాలు లేవు.

**మంచి ప్రభుత్వంలో చీడపురుగులు**

కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వం చేసిన తప్పులు చేయకుండా అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ మంచి ప్రభుత్వంగా ప్రజల మన్ననలు పొందుతుంది. కానీ లైమ్ సిటీలో కొంతమంది అనధికారికంగా లాటరీ టికెట్లు అమ్మి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నారు. కావున మంచి ప్రభుత్వంలో చీడపురుగులుగా తయారైన లాటరీ ముఠా సభ్యులను అరెస్టు చేసి, జైలుకు పంపించి అమాయక ప్రజలను లాటరీ మాఫియా నుండి కాపాడాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

# అమ్మవారి సేవలో ఎమ్మెల్యే జూలకంటి శరన్నవరాత్రుల ఉత్సవాలపై సమీక్ష



**దుర్గి.అక్టోబర్ 09రాజధాని వాయిస్ :** అడిగొప్పల శ్రీ నిదానంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారిని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం రానున్న దసరా ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలను ఆలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్లును సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు లింగా బ్రహ్మయ్య,మునిగోటి సత్యానారాయణ, యాగంటి వెంకటేశ్వర్లు, గరిణే రమేష్, యాగంటి నరేష్, కొమెరా దుర్గారావు, జక్కా రమేష్, వలి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు సన్నద్ధంకండి

### - మండల నాయకులతో ముఖాముఖి

**దుర్గి.అక్టోబర్ 09 రాజధాని వాయిస్ :**2024 సాధారణ ఎన్నికల్లో చూపించిన స్ఫూర్తితోనే రానున్న స్థానిక ఎన్నికల్లో కూటమి విజయం కోసం కలిసి పని చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం కూటమి పార్టీల శ్రేణులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని కోరారు. సమిష్టిగా గ్రామాల్లో ప్రచారం నిర్వహించి.., కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను, అందిస్తున్న సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. కూటమి పార్టీల గెలుపే లక్ష్యంగా



అందరూ కలిసి పని చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మునిగోటి సత్యానారాయణ, పులి హరి, యాగంటి నరేష్, కొమెర దుర్గారావు, జక్కా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంపై వైసీపీ అణచివేత ధోరణి

### ప్రాథమిక హక్కులను హరించి రాజ్యాంగం కూనీ
### ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి





**దుర్గి. అక్టోబర్ 09 రాజధాని వాయిస్ :** ప్రజాస్వామ్యంపై వైసీపీ అణచివేత ధోరణిని రాష్ట్ర ప్రజలు మరవరని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం మండల పరిధిలోని పర్యటించిన ఆయన, మీ భూమి,మీ హక్కు పథకం ద్వారా రీ సర్వే లో ప్రభుత్వం మంజూరు చేసిన రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను రైతులకు అందజేశారు. ముందుగా రాజానగరం గ్రామంలో రెవిన్యూ శాఖ అధికారులు నిర్వహించిన నూతన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో 1215 పాసుపుస్తకాలను రైతులకు అందజేశారు. అనంతరం దుర్గి మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి వారి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 1426 నూతన పట్టాదారు పాసుపుస్తకాలను ఎమ్మెల్యే రైతులకు అందజేశారు. ఈ నేపథ్యంలో కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రజలు వేసిన ఒక్క ఓటుతో ప్రజాప్రభుత్వం ఎన్నో ప్రయోజనకరమైన కార్యక్రమాలను చేపట్టిందని వివరించారు. ఒక్క ఓటు సంక్షేమాన్ని ఇంటికి నడిపించింది,వీధుల్లో అభివృద్ధిని పరుగులు పెట్టించింది, పచ్చని గ్రామాల్లో శాంతిని నెలకొల్పింది, పట్టణాల్లో రౌడీలను తరిమికొట్టింది, రక్తసిక్తంగా మారి వ్యవస్థను మార్చి, అహింసా మార్గంలో ప్రగతిని సాధిస్తోంది, విధ్వంసమైన ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టి పెట్టుబడులు తెచ్చి, ఉపాధి, ఉద్యోగావకాశాలను అందిస్తోందని జూలకంటి పునరుద్ఘాటించారు. జగన్ రెడ్డి దోపిడికి కాదేది అనర్హం అన్నట్లు ల్యాండ్, శ్యాండ్, మైన్, వైన్ వ్యవహారంలో వేల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో నియోజకవర్గంలో జల్ జీవన్ మిషన్, అమృత్ స్కీం ద్వారా తాగునీటి ప్రాజెక్టులు శరవేగంగా నిర్మాణం జరుగుతోందని వెల్లడించారు. త్వరలో వరకిపూడిశెల నిర్మాణ పనులకు భూమిపూజ జరుగుతోందని ధీమా వ్యక్తం చేశారు. కులాలు మతాలు మధ్య చిచ్చుపెట్టి, వేడుక చూడడం మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి పరిపాటిగా మారిందని దుయ్యపట్టారు. ప్రాథమిక హక్కులను హరించి రాజ్యాంగం కూనీ చేసిన వైసీపీని స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. రాష్ట్రంలో చంద్రబాబు, మాచర్ల నియోజకవర్గం తాను ప్రగతి కోసం పాటుపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అధికారులు నిమ్మల శ్రీనివాసరావు, కూటమి పార్టీల నాయకులు యాగంటి మల్లికార్జునరావు, లింగా బ్రహ్మయ్య, మునిగోటి సత్యనారాయణ, జానికీ రామయ్య, పులి హరి, రుద్రాల రవి, తోటకూర శ్రీనివాసరావు,జక్కా రమేష్, వలి, ఆదినారాయణ, హనుమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సి. బెళగల్‌లో పోలీసుల కార్డన్ సెర్చ్

- స్థానిక ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి
- నేరాల నియంత్రణపై గ్రామస్థులకు అవగాహన
- అత్యవసర సమయంలో డయల్ 112కు ఫోన్ చేయాలి

**కర్నూలు, రాజధాని వాయిస్ :** రాబోయే స్థానిక సంస్థల ఎన్ని కల నేపథ్యంలో శాంతిభద్రతలను పరిరక్షించడం, నేరాలను నియంత్రించడం లక్ష్యంగా కర్నూలు జిల్లా సి. బెళగల్ గ్రామంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కోడుమూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఎస్సైల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో గ్రామంలో భద్రతా పరిస్థితులు, నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టడంలో భాగంగా పోలీసు అధికారులు గ్రామస్థులకు పలు సూచనలు చేశారు. గ్రామంలో శాంతియుత వాతావరణాన్ని కొనసాగించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.స్థానిక ఎన్నికల సమయంలో ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా, గొడవలు లేదా ఘర్షణలకు దూరంగా ఉండాలని పోలీసు అధికారులు సూచించారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. గ్రామస్థుల సహకారంతో నేరాలను అరికట్టడం, ప్రజలకు భద్రత కల్పించడం సాధ్యమవుతుందని వివరించారు.కార్డన్ సెర్చ్ సందర్భంగా నేరాల నియంత్రణతో పాటు అత్యవసర సమయాల్లో పోలీసుల సహాయం పొందే విధానంపై కూడా అధికారులు అవగాహన కల్పించారు. ప్రమాదాలు, గొడవలు, మహిళలపై వేధింపులు లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు డయల్ 112కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందవచ్చని తెలిపారు. సమస్య ఎదురైనప్పుడు ఆలస్యం చేయకుండా సమాచారం అందించడం ద్వారా త్వరితగతిన స్పందించే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రజలు పోలీసులతో సమన్వయం చేసుకుంటూ తమ పరిసరాల్లో భద్రతను కాపాడుకోవాలని సూచించారు.గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు పోలీసు శాఖ నిరంతరం చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో భద్రతపై నమ్మకం పెంపొందించడంతో పాటు చట్టాలపై అవగాహన కల్పించడం ఇటువంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. గ్రామస్థులు అప్రమత్తంగా ఉంటూ అనుమానాస్పద పరిణామాలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రజలు సహకరించాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 సేవలను వినియోగించుకోవాలని సూచించారు.



# వార్డుల పునర్విభజనపై సంగడిగుంట ముస్లింల ఆందోళన

**గుంటూరు, రాజధాని వాయిస్ :** గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని సంగడిగుంట పాత 13వ వార్డును ఇప్పుడు కొత్త 22వ వార్డుగా మార్చి, సంగడిగుంటలో పాత చెక్కల బజార్ వద్ద 1946 నుండి ఉన్న చారిత్రాత్మక పెద్ద మసీదు (బడి మసీద్) ను ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా డీఎస్ నగర్ వార్డులో కలపడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈరోజు శుక్రవారం మధ్యాహ్నం జుమ్మా నమాజ్ అనంతరం సంగడిగుంట పెద్ద మసీదు వద్ద శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది.గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు మరియు గుంటూరు మున్సిపల్ కమిషనర్ పెద్ద మసీదు మత పెద్దలకు, స్థానిక సంగడిగుంట ముస్లిం ప్రజలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా, ఏకపక్షంగా వార్డులను మార్చడం ఇష్టారాజ్యంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. 1946 నుండి సంగడిగుంట గుర్తింపుగా, మా మతపరమైన, సాంస్కృతిక కేంద్రంగా ఉన్న పెద్ద మసీదును సంగడిగుంట నుండి వేరు చేయడం సరికాదు. “మా సంగడిగుంట గుర్తింపు – మా పెద్ద మసీదు” అని, మసీదును తిరిగి పాత 13వ వార్డు (ప్రస్తుత సంగడిగుంట వార్డు పరిధిలోనే) కొనసాగించాలని డిమాండ్ చేస్తూ “దిల్ సే హమారా సంగడిగుంట – బడి మసీద్ హమారా” అనే కార్యక్రమంతో స్థానిక ముస్లిం ప్రజల మద్దతుతో భారీ సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.

మా ప్రధాన డిమాండ్లు:

1946 నాటి చారిత్రాత్మక సంగడిగుంట పెద్ద మసీదును డీఎస్ నగర్ వార్డు నుండి తొలగించి, తిరిగి సంగడిగుంట పాత 13వ వార్డు పరిధిలోనే కొనసాగించాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com